## క్లుప్తంగా

### గురుకుల పాఠశాలలో జెడ్పీ సీఈవో తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి

రాయికల్: మండలంలోని అల్లీపూర్ మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో శుక్రవారం జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ ఉన్నారు.

### అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ సిబ్బంది



పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బీ రాజాగౌడ్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మోహన్‌తో పాటు పలు విభాగాల అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీవో రాజేంద్రప్రసాద్, ఆర్ఓ మీర్జా అజ్మతుల్లా బేగ్, ఆర్ఐ అక్షయ్, టీపీఎస్ అశోక్‌లు ఉన్నారు.

### చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలి



మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల: చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేయాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వసంత అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ, జీఎస్టీలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ఎన్డీఏ ప్రభుత్వం సామాన్యులను నడ్డి విరుస్తూ ధనవంతులకు దోచి పెడుతుందని ఆరోపించారు. దేశంలో ఎక్కువ మంది జీవనాధారంగా ఉన్న చేనేత దుస్తులు టెక్స్‌టైల్ రంగంపై 12 నుంచి 18 శాతం జీఎస్టీ వేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటేశ్వర్ రావు, గంగాధర్ ఉన్నారు.

### గర్భిణులు, చిన్నారులకు సకాలంలో టీకాలు అందించాలి



ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐవో శ్రీనివాస్

కథలాపూర్: గర్భిణులు, చిన్నారులకు సకాలంలో టీకాలు అందించాలని వైద్యశాఖ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించి వైద్యసేవలు అందిస్తున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ అర్చన, వైద్యాధికారి సింధూజ ఉన్నారు.

### పోక్సో చట్టాలపై విద్యార్థుల్లో అవగాహన పెరగాలి



అవగాహన కల్పిస్తున్న సాధికారత సభ్యులు

జగిత్యాలరూరల్: పోక్సో చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మహిళ, శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత సభ్యులు స్వప్న, గౌతమి అన్నారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ మండలం మోతె ప్రభుత్వ పాఠశాలలో బాలసభ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోక్సో 2012 చట్టంపై విద్యార్థులు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు బాలికలపై లైంగిక (అత్యాచార) వేదింపులకు గురిచేస్తే నేరం రుజువైతే నింధితులకు 10 నుంచి 20 ఏళ్ల జైలుశిక్ష పడుతుందన్నారు. విద్యార్థినులు, మంచి వ్యక్తిత్వం, నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత సిబ్బంది హేమశ్రీ, షీటీం సభ్యులు పూజిత, చైల్డ్ వెల్ఫేర్ టీం సభ్యులు అన్నపూర్ణ, హెచ్ఎం శోభారాణి పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినికి మెడల్ ప్రదానం చేస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

మెట్‌పల్లి రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని మెట్‌పల్లి ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు.మెట్‌పల్లి మండలం వెల్లుల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఎంఈవో మెడల్స్,కప్స్ అందజేశారు కార్యక్రమంలో పీఈటీలు, హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్,హరీష్,తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని తహసీల్దార్ వాహిదొద్దీన్, డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సారంగాపూర్‌లో ఎస్జీఎఫ్ క్రీడల ముగింపులో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బుగ్గారపు కిషోర్, నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు. బీర్‌పూర్ మండలంలో ఎస్జీఎఫ్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు ఎంఈవో బహుమతులు అందించారు.

రాయికల్: క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని ఎంఈవో రాఘవులు అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో మండలస్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. జేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ మండల కన్వీనర్ కృష్ణప్రసాద్, కరస్పాండెంట్లు రాజిరెడ్డి, సత్యంగౌడ్, రాజేశ్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు శుక్రవారం ముగిసాయి. వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో పీడీలు రవీందర్, రంజిత్, రాజేశ్, నవీన్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు మెడల్స్‌ను అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంఈవో మధు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రాజన్న, పీడీలు పాల్గొన్నారు.

పెగడపల్లి: పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో రాణించే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో సులోచన అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14,17 విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు రమేశ్, నవీన్, కళ్యాణ్, నవత, దేవిక, కార్తీక్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొడిమ్యాల: గ్రామాల అభివృద్ధే ప్రజాప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయంలో 46 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే బాలికల అండర్- 14 ,అండర్ -17 క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు ఆడటం వలన క్రమ శిక్షణతో పాటు శారీకరంగా,మానసికంగా ధృఢంగా తయారవుతారని తెలిపారు అనంతరం దమ్మయ్యపేట గ్రామంలో వరదరాయ చెరువును పరిశీలించి త్వరగా పనులు చేపడతామని తెలిపారు. అంగన్‌వాడీ నూతన బిల్డింగ్ భూమిపూజ చేసి ఒడ్డెర కులసంఘ భవనం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ‘చెరుకు రైతులను మోసం చేసింది ఎంపీ అర్విందే’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: తనను ఎంపీగా గెలిపిస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పిన ధర్మపురి అర్వింద్ ఆ తర్వాత దానిని విస్మరించి రైతులను మోసం చేశారని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ వాకిట సత్యంరెడ్డి విమర్శించారు. పట్టణంలో శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌తో కలిసి మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించే విషయంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ఎంపీగా గెలిపిస్తే షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని రైతులకు హామీ ఇచ్చిన అర్వింద్..దానిని ఎందుకు నిలబెట్టుకోలేదో ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తొందరలోనే ఫ్యాక్టరీని పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో నాయకులు ఖుత్బుద్దీన్, అందె మారుతి, కొమ్ముల చిన్నారెడ్డి, కల్లెడ గంగాధర్, అశోక్, శంకర్, గణేష్ తదితరులున్నారు.

## జిల్లాకు 2.20 లక్షల ఇందిరమ్మ చీరలు

పెగడపల్లి: బతుకమ్మ పండుగకు మహిళలకు ప్రభుత్వం రెండు చీరలు కానుకగా ఇవ్వనుందని డీఆర్డీవో రఘువరణ్ అన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డితో కలిసి మాట్లాడారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు 2.20 లక్షల మంది మహిళలకు ఈ చీరలు కేటాయించినట్లు ఆయన తెలిపారు. త్వరలో చీరలు జిల్లాకు చేరనున్నాయని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విధివిధానాలకు అనసురించి వాటిని పంపిణీపై స్పష్టత వస్తుందన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సెర్ప్ సీసీ కొత్తూరి రవికుమార్ కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ. 30 వేలు అందజేశారు. ఆయన వెంట ఏడీఆర్డీవో సునీత, డీపీఎం రమేశ్, ఏపీఎం రవివర్మ, ఏపీవో అనిల్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

**స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యకర జీవితం**

జగిత్యాల: స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యకరమైన జీవితం ఉంటుందని ప్రముఖ వైద్యురాలు అర్చన అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, నీలి ఆకాశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ కో-ఆర్డినేటర్ మురళీ, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

**బాల్య వివాహాలపై అవగాహన సదస్సు**

జగిత్యాల: బాల్య వివాహాలపై జిల్లా కేంద్రంలోని పలు మసీదుల్లో సహాయ ఎన్జీవో చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు ఉండాలని, లేకుంటే పెళ్లిలు చేయరాదన్నారు. ఎవరైనా వివాహం జరిపితే 1098కు కాల్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ భూమేశ్, లత, లహరి, శ్యామల, మధు పాల్గొన్నారు.

**విశ్వకర్మ కిట్ల పంపిణీ**

రాయికల్: పట్టణంలోని తపాలా కార్యాలయంలో శుక్రవారం ప్రధానమంత్రి విశ్వకర్మ కిట్లను బీజేపీ పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి విశ్వకర్మ కిట్లను పంపిణీ చేశారు. సబ్ పోస్టుమాస్టర్ రాజు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భూమేశ్, ఉపాధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, అందె శంకర్, అజయ్, రఘు పాల్గొన్నారు.

**డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు**

జగిత్యాల: ఈనెల 15, 16 తేదీల్లో ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయని ప్రిన్సిపల్ అశోక్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్‌లలో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

**రైతులకు మెరుగైన సేవలు**

కథలాపూర్: మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని కథలాపూర్ ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులకు మార్కెట్ కమిటీ నుంచి రూ. 24.79 లక్షలు వెచ్చించాలని నిర్ణయించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషా, డైరెక్టర్లు పాల్గొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, హన్మాజీపేట గ్రామాల్లో శనివారం సాయంత్రం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. జగిత్యాల టౌన్-2 పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ గంగారాం తెలిపారు.

మల్లాపూర్: మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోనిని కుస్తాపూర్, రత్నాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాను శనివారం మధ్యాహ్నం 1 గంటల నుంచి 6 గంటల వరకు నిలిపివేయనున్నట్లు ఏఈ వీనిత్‌రెడ్డి తెలిపారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని యామాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ తెలిపారు.

కోరుట్ల: పట్టణ శివారులో శనివారం అర్బన్ కాలనీ,కేసీఆర్ కాలనీ,మెట్‌పల్లి రోడ్, అయోధ్యపట్నం, ఎసుకోని గుట్ట, అల్లమయ్య గుట్ట, బిలాల్‌పూర, అదర్శనగర్, వేములవాడ రోడ్, చిన్నతోట వాడ, ఏరియాల్లో ఉదయం 10 గంటలనుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కోరుట్ల-2 విద్యుత్ అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ శుక్రవారం తెలిపారు.

కోరుట్ల రూరల్: పెద్దాపూర్, కోనరావుపేట 33 కేవి లైన్ల మరమ్మతుల కారణంగా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్, కోనరావుపేట సబ్‌స్టేషన్ల పరిదిలోని పెద్దాపూర్,రాంరావుపల్లె, కోనరావుపేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ అవతరాయం ఉంటుందని కోరుట్ల రూరల్ ఏఈ పేర్కొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని మైతాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ తుమ్మల నవీన్ శుక్రవారం తెలిపారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంగా బోర్డు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

మెట్‌పల్లి: పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని గతంలో పేర్కొన్న విధంగా బోర్డుపై సబ్ కలెక్టర్ కార్యాలయంగా మార్చాలని కోరుతూ నియోజకవర్గ అభివృద్ధి సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఏవో విజయలలితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షులు తోకల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు గట్టయ్య, సురేందర్, తదితరులున్నారు.

## పాఠశాలలో టీవీ ఏర్పాటు

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో శుక్రవారం ఎమ్మార్సీ నిధుల నుంచి రూ.10 వేలు అందజేయగా హెచ్ఎం రమేశ్ నర్సయ్య అందజేసిన మరో రూ.2 వేలతో టీవీని కొనుగోలు చేయగా ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురై శ్రీనివాస్, వేల్పుల గంగరాజం, లక్కడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి

కథలాపూర్: రైతులు పాడి పరిశ్రమపై దృష్టిసారించాలని కథలాపూర్ పశువైద్యాధికారి దివ్యశ్రీ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం దుంపేటలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. గ్రామంలోని 21 గేదెలకు కృత్తిమ గర్భధారణ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాజుకుమార్, రసూల్, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కుటుంబానికి పీఆర్టీయూ చేయూత

జగిత్యాల/కొడిమ్యాల: కొడిమ్యాల మండల పరిషత్ చెప్యాల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చింతపండు రాము అనారోగ్యంతో మరణించగా, జగిత్యాల పీఆర్టీయూ నాయకులు అండగా నిలిచారు. కరీంనగర్‌లోని వారి స్వగృహంలో శుక్రవారం రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆనంద్‌రావు మాట్లాడుతూ చిన్నతనంలోనే ఉపాధ్యాయుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, కొడిమ్యాల మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**సీపీగేట్ ప్రవేశపరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ**

జగిత్యాల: ఉస్మానియా యూనివర్సిటీ ఇటీవల నిర్వహించిన సీపీగేట్ ప్రవేశపరీక్షల్లో ఎస్‌కేఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు శృతి, అశ్విని అత్యంత ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారు. ఎంఏ ఎకానమిక్స్‌లో శృతి రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ సాధించగా, ఎంకాం విభాగంలో టి.అశ్విని 255వ ర్యాంక్ సాధించింది. అలాగే మరికొంత మంది విద్యార్థులు సైతం ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వైస్ ప్రిన్సిపాల్ ఆడెపు శ్రీనివాస్, అధ్యాపకులు సాయిమధుకర్, రాజు, గోవర్ధన్, సురేందర్, శ్రీనివాస్, రజిత, సుప్రియ, మహేశ్, స్వరూప అభినందించారు.

## విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక స్వాలంభన దిశగా జీవితాన్ని కొనసాగించాలని మై భారత్ యూత్ ఆఫీసర్ వెంకట్ రాంబాబు అన్నారు. శుక్రవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై మేర యువ భారత్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ యోజన, పీఎం కౌశల్య యోజన, పీఎం ముద్రయోజన, ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయింట్ జనరేషన్ ప్రోగ్రాం పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు బిజినెస్‌లో కూడా రాణించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కో-ఆర్డినేటర్ భూమేశ్, హ్యూమన్ రిసోర్స్ పర్సన్ సంతోష్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదవారి కల సాకారం



ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న నర్సింగరావు

కోరుట్ల రూరల్: రాష్ట్రంలో ప్రతీ పేదవాడి సొంతింటి కల నిజం చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని సర్పరాజ్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి నర్సింగరావు శుక్రవారం హాజరై ప్రారంభించారు. సర్పరాజ్‌పూర్ గ్రామానికి చెందిన భూమి విజయ, పెంట లక్ష్మి, పెద్ది గంగుల ఇళ్లు పూర్తి కావటంతో ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ తోట గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**రూ. 49 లక్షలతో అదనపు తరగతి గదులు**

కోరుట్ల: పట్టణంలోని 17వ వార్డులోని ఉర్దూ మీడియం పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు జువ్వాడి నర్సింగరావు శుక్రవారం భూమిపూజ చేశారు.కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి



బీడీ కార్మికులతో మాట్లాడుతున్న కళావతి

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సాంబారి కళావతి అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పన్నేండేళ్లుగా ప్రధాని మోదీ సుపరిపాలనతో భారతదేశం అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు. రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మీ, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, బీజేపీ మండల ఉపాధ్యక్షులు లవంగ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు**

కథలాపూర్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో మెట్‌పల్లి డీఈ మధుసుదన్ పేర్కొన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం బొమ్మెన, భూషణరావుపేట గ్రామాల్లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బ్రేకర్లను పరిశీలించారు. సిరికొండలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. బ్రేకర్ పనులను వారంరోజుల్లో పూర్తి చేయించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏడీఈ రఘుపతి, ఏఈ దివాకర్‌రావు ఉన్నారు.

**బీడీ కంపెనీ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులు ఆందోళన**

కథలాపూర్: మండలంలోని తాండ్య్రాలలో ఓ బీడీ కంపెనీ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. బీడీ కార్మికులకు వేతనాలు చెల్లించే సమయంలో తినుబండరాల ప్యాకెట్లు అంటగట్టి డబ్బులు కోత విధిస్తున్నారని మండిపడ్డారు. వారు ఇచ్చే నాసిరకం తినుబండరాల ప్యాకెట్లు చిన్నపిల్లలు తింటే అనారోగ్యాలపాలవుతున్నారని వాపోయారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలన్నారు. కార్మికులకు నెలకు ఇష్టారీతిన డబ్బులు కోతలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు అనవసరంగా తినుబండరాల ప్యాకెట్లు అంటగట్టడం మానుకోవాలని, వేతనాల్లో కోతలు విధించవద్దని ఆందోళన చేపట్టారు.

**బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి**

జగిత్యాల: బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ జనరల్ ప్రతినిధి ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పలు స్కూళ్లలో బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్‌ల కోసం నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ వెల్ఫేర్ కమిషనర్ సాగర్, భీమేశ్వర్ రావు, డాక్టర్ శ్రీకాంత్ ఉన్నారు.

**జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక**

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల మండలస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీడీ కొండపల్కల కోటేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం వారిని హెచ్ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

జగిత్యాల రూరల్: ఎస్జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలలో జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన 17 మంది బాలికలు, 14 మంది బాలురు అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వినిత్‌కుమార్, అజీమ్ తెలిపారు.

**స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, బోధనలతో నాణ్యమైన చదువు**

మల్లాపూర్: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలతో ఉపాధ్యాయులు అందించే బోధనలతో నాణ్యత పెరుగుతుందని మల్లాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల సోషల్ స్కూల్ అసిస్టెంట్ల ఉపాధ్యాయులతో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం సర్కారు బడులను బలోపేతం చేయడానికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్లు మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయ ముట్టడి విజయవంతం చేయాలి**

కోరుట్ల రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచటంతో పాటు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ నెల 15న నిర్వహించే రాష్ట్ర వ్యాప్త తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో శెట్టిపెల్లి ఓంప్రకాష్, ఎండీ ఫిరోజ్ బాబా, సదుల మనోజ్, గట్ల తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి శ్రీహరిని కలిసిన బీసీ సంఘం మండల నాయకులు**

మల్లాపూర్: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, యువజన, క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎనుగందుల రమేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. బీసీ సంఘాల బలోపేతానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించాలని మంత్రి శ్రీహరికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

**స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం కావాలి**

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ మండల సేవా పక్షం బాధ్యులు లింగంపెల్లి శంకర్ అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లో బీజేపీ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, గాంధారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌హెచ్ఆర్సీ మండల అధ్యక్షుడిగా కిశోర్**

పెగడపల్లి: జాతీయ మానవ హక్కుల కమిటీ పెగడపల్లి మండల అధ్యక్షుడిగా మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన చింతకింది కిశోర్ నియామకమయ్యారు. ఈ మేరకు మండల కమిటిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల ఉపాధ్యక్షుడిగా రామడుగు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కాశెట్టి రాజు, సంయుక్త కార్యదర్శిగా సంజీవ్ నియామకమయ్యారు.

**ఇంటింటా పరిశుభ్రతతో వ్యాధుల నియంత్రణ**

మల్యాల: ఇంటింటా పరిశుభ్రత పాటించాలని, పరిసరాల పరిశుభ్రతకుసైతం కషి చేయాలని ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. మండలంలోని బల్వంతాపూర్‌లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరిగి, నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. టీబీ, మలేరియా, డెంగ్యూ వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రమేశ్, సీహెచ్ఓ జ్యోతి, సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**జాతీయస్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు విద్యార్థులు**

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ వాగ్దేవీ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పెద్దపల్లి జిల్లాలోని 8 ఇంక్లైన్ కాలనీలో నిర్వహించిన మూడో జూనియర్ డాడ్జ్ బాల్ పోటీల్లో విద్యార్థులు కె.సహస్ర, ఎం.సింధు, ఎస్.అక్షర, కొళ్ల సహస్ర, బి.హర్షిత, డి.మహాలక్ష్మీ, ఎం.శివసాయి, ఎం.జేమ్స్ ఎంపికయ్యారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నరేశ్ పీఈటీలు అక్షయ్, తిరుపతి, ఆశిక్, రేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.